# పెళ్ళి చూపులు



## ఆల కాళిదాస్

"ప్రియ ఇందూ!

ఈ ఉత్తరం ఇప్పుడు నీ కెందుకు రాస్తున్నానో, దేని కోసం రాస్తున్నానో అని నన్ను నేనే ప్రశ్నించుకుంటే, నా అంతరాత్మలోని ఆవేదన నీ ముందు వెల్లడించుకొంటున్నాననే సమాధానం తప్ప మరింకొకటి నా ఊహకి అందలేదు. నీకు నవ్వు రావచ్చు. ముచ్చటగా కోటి మధురస్వప్నాలకు ప్రతీకగా పెళ్లికూతురువై ఉండి ఈ ఆనంద సమయంలో, కన్నెపిల్లలు కలలుగనే వరుడి లక్షణాలన్ని ఉన్న వ్యక్తిని, అందునా తనకు తానై నీ నుంచి దమ్మిడీ కట్నమైనా ఆశించని వ్యక్తిని, పెళ్లి చేసుకుంటున్న ఈ ఆనందసమయంలో నీ గుండెల్లో ఏమిటే ఆవేదన? చెప్పు కుంటే చిత్రంగా లేదూ! అని ఊహించు కుని నవ్వుకుంటావు కదూ!

వయస్సుంది. అందముంది. ఇంత వరకూ మరో వ్యక్తికి సమర్పించుకోని, మాలిన్యంలేని మనస్సుంది. మరి ఈ పెళ్లికూతురికి ఈ వేళ ఈ దిగు లెందుకు? తీరని కన్నీ రెందుకు? అని ఆశ్చర్యపడుతున్నావా?

ఇందూ! 'నా కీ పెళ్లి ఇష్టంలే' దని ఒక్క ముక్క చెప్పగల ధైర్యం నా కుంటే, లేదూ భగవంతుడైనా అల్లాంటి ధైర్యం నా కివ్వగలిగితే నే నెంతో సంతోషిస్తాను. కాని, ఇప్పుడు నా కా ధైర్యం లేదు. భగవంతుడూ ఇచ్చేట్టు లేడు. అలా ఇస్తే ఎంత మంచిది! నీకు లభించవలసిన ఈ ఆణిముత్యాన్ని తిరిగి నీకే ఇచ్చివెయ్యగలను.

ఇందూ! జరిగిందంతా తలుచుకుంటే నా కిప్పటికీ ఒక పీడ కలలా ఉంది. నిజం, ఇందూ! ఆ నాడు నీ పెళ్లిచూపులకి నేనుగాని, అమ్మగాని మీ ఇంటికి రాకుండా ఉండిఉంటే ఈనాడు ఇలా జరిగి ఉండేది కాదు. ఈ స్థానంలో నే నుండేదాన్ని కాదు. ఈనాడు నా కీ

గుండెకోత ఉండేదీ కాదు!


ఇంతక్రితమే ముత్తయిదువులు నన్ను పెళ్ళికూతుర్ని చేసి అందంగా అలంకరించి వెళ్ళిపోయారు. పైగా, ఈ అలంకరణతో నా అందం మరింత ద్విగుణీకృతమైన దట! నాకు నేనే సాటిఅట! ఇప్పు డను కుంటున్నాను, 'అందం ఎంత భయంకర మైనదీ!' అని. నిజం, ఇందూ! ఈ నా అందమే నీకు లభించవలిసిన అదృష్టాన్ని, సర్వస్వాన్ని నాకు బలవంతంగా అంట గట్టింది. నా విషయంలో కాకుండా మరి ఇంకొకరి విషయంలో ఇలా జరిగి ఉంటే, నా స్థానంలో వాళ్ళుంటే బహుశా వాళ్ళు తమ అందానికి పొంగి పోయేవారేమో! కాని నాకు మాత్రం అటువంటి గర్వం లేదు.

సంతోషం అంతకన్నా లేదు. మీదు మిక్కిలి చెప్పరాని అసహ్యం నా అందం మీద కలుగుతూంది. ఇతరుల స్వంత వస్తువులను అపహరించే దొంగలా నా అందం నాకు ఈనాడు కనిపిస్తుంది. 'ఛీ! వెధవ అందం! పాపిష్ఠి అందం! ఈ అందాన్ని గోకి తీసి పాతిపెట్టా' లనిపిస్తుంది. ఇంత యాసిడ్‌తో నా మొహాన్ని కాల్చేసుకోవాలనిపిస్తుంది. ఇల్లాంటి భయంకరమైన ఆలోచనలు ఈవేళ నా అందంమీద కలుగుతున్నాయి.

ఇందూ! బయట పెళ్ళిపందిరిలో బాండుమేళం నా చెవులు చిల్లులుపడేలా మోగుతూంది. సమ్మెటపోటులా అది నా గుండెలకు తగులుతూంది. కిటికీ లోంచి అంతా చూస్తూనే ఉన్నాను. పెళ్ళికొడుకు అక్కడ కుర్చీలో కూచుని ముసిముసినవ్వులు నవ్వుకుంటున్నాడు. బహుశా అందమైన నన్ను పెళ్ళాడ బోతున్నాననుకొని గర్వంతో నవ్వు కుంటున్నాడనుకొంటున్నాను. అంతే అయి ఉంటుంది. లేకుంటే ఒక ముద్దరాలి గుండెల్లో వెలిగిన ఆశాజ్యోతిని ఆర్పేశానని, మరో మగువ గుండెల్లో ఆనందానికి బదులు తీరని మనస్తాపాన్ని రగిలించానని ఏమాత్రమన్నా ఆలోచించి ఉంటాడా? అలా ఆలోచించగల చేవగల హృదయు మతనికే ఉంటే ఈ వేళ ఇలా నవ్వగలిగే వాడు కాడేమో! పైగా చూడు! ఆ నవ్వులో ఎంత గర్వమో! బహుశా తనొక్కడే ఈ లోకంలో కట్నం లేకుండా అందమయిన అమ్మాయిని పెళ్ళాడేస్తున్నా ననే గర్వమే అయి ఉంటుం దది. పిచ్చి మానవుడు! తనేదో త్యాగం చేస్తున్నా నని అనుకొని మరొకరిని తనకి తెలిసీ తెలియకుండానే దుఃఖపెడుతున్నానని అనుకోడు. ఎంత చిత్రమైనవాళ్ళు ఈ యువకపుంగవులు!

ఇందూ! నాకే తెలియదు, నాలో కలుగుతున్న ఈ విచిత్రమైన మార్పు లేమిటో! క్షణక్షణానికి నా మనస్సు చంచలమై పోతున్నది. అడుగడుగునా

నిముషాలలో మాయమయిన జలుబు!



అమృతాంజనం

ప్రభావం వల్లనే!

జలుబులు, తలనొప్పి, బెణుకులు, కండరాలనొప్పి—వీటిని చప్పున చల్లగా తగ్గించుకోండి. బాధగా ఉన్న చోటు మీద అమృతాంజనం రాయండి. వెంటనే గుణం ఇస్తుంది. 75 సంవత్సరాలపైగా ఇంటింటి దీపమై వెలుగుతోంది అమృతాంజనం! ఎప్పుడూ ఒక సీసా దగ్గిర ఉంచుకోండి. అమృతాంజనం ఆధాటేసే పెద్ద సీసాలలోనూ, చిన్న డబ్బాలలోనూకూడా దొరుకుతోంది.

అమృతాంజనం 10 ఔషధాలు కలిసినది. నొప్పులను, జలుబులను చప్పున, చల్లగా తగ్గిస్తుంది.




అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు - బొంబాయి - కలకత్తా -
న్యూఢిల్లీ - హైదరాబాదు - బెంగళూరు.

AM-5340

అశాంతి వెర్రితలలు వేస్తున్నది.

నా పెళ్ళి అని తెలిసినప్పుడు నాకు సంతోషం కలగనే లేదు. పైగా, విచారం, దిగులు నా మనస్సులో చోటు చేసుకొన్నాయి. కాబోయే భర్తను తలుచుకొంటే సిగ్గు ముంచుకు రాలేదు. కళ్ళ మనస్సు అల్లిన తెరల వెనక దాగి కాబోయే భర్త స్వరూపాన్ని చూడడానికి కూడా ఇష్టపడటం లేదు. అతన్ని తలుచుకున్నప్పుడు అసహ్యం వేస్తున్నది. తియ్యని కలల మాట అటుంచి కళ్లలో నీళ్ళు. ఎంత ప్రయత్నించినా ఆగని కన్నీరు. పెళ్ళికూతుర్ని అయినా మొహంలో కొత్త కళ రాలేదు. ఏదో ప్రేతకళ ఆవరించిన మొహంలా నా మొహం నిరంతరం నా కుపిస్తూనే ఉన్నది. కొన్ని గంటల్లో పెళ్ళి అంటే సంతోషం కలగటం లేదు సరికదా దిగులు. కొత్తగా నేరం చేసిన అపరాధిలా మనస్సులో ఒకటే బాధ! విషాద బాధ! బహుశా నీ ఉసురు నాకు శాపంలా తగిలి ఉంటుంది. నిజం! అంతే అయిఉంటుంది. లేకుంటే ఎందుకీ విచిత్రమైన వ్యథ నన్ను దహించివేస్తుంది?

ఇందూ! మనం చదువుకున్న పుస్తకాల్లో శపించిన వాక్కు గాని, మనసు గాని తిరిగి దీవిస్తుందని అంటారు. అలాగే నువ్వు నన్ను దీవించు. (నువ్వు నన్ను శపించావని దీని అర్థం కాదు. నీ ఉసురే శాపంలా నాకు తగిలింది నీకు తెలీకుండానే అని నా భావం.) దీవించి ఆ శాపాన్ని మళ్ళించు. చెప్పలేని భయంకరమైన నా మానసిక వ్యథ నా నుండి తీసివెయ్యి. నా మనస్సుకి శాంతి ప్రసాదించు. నీ మేలు జన్మజన్మలకీ మరిచి పోలేను.

నువ్వూ, నేనూ చదువుకున్నాము. అనసూయకూడా మనతోపాటే చదువుకుంది. వ్యక్తిత్వంలేని తను తన భవిష్యత్తును వాళ్ల అమ్మా నాన్నా చేతుల్లో పెట్టి ఊరుకుంది. ఆ నాడు దాన్ని చూసి మనం నవ్వుకున్నాము. 'ఇంతేనా నీ వ్యక్తిత్వం?' అని దాన్ని గేలిచేశాము. 'అయ్యో! పూర్ క్రీచర్' అనుకున్నాము. కాని ఇప్పుడు నేనూ ఇంతే! నాకూ వ్యక్తిత్వం లేదు!

నా భవిష్యత్తుని నేనే దిద్దుకోవాలనుకున్నాను. కాని, అమ్మ నాకు తెలీకుండానే నా జీవితాన్ని శాసించివేసింది. నా పెళ్ళి ఇదుగో ఈయనతో నిశ్చయం చేసింది. ఇది ఇంకొకరితో అయితే నే నింత బాధ పడేదాన్ని కాదు. కాని, నా బాధ ఏమిటో తెలుసా? నీ అదృష్టాన్ని అవలీలగా మగ పెళ్ళివారితో కలిసి తుడిచివేసింది మా అమ్మ! నీ సంతోషాన్ని కసిదీరా నమిలి మింగేసిం దామె! తనకు కావలిసింది తన కూతురి సుఖం. ఆ సుఖం కోసం ఎంతటి పనిఅయినా చెయ్యగల దామె అని అనిపించుకుంది ఇన్నాళ్లకు!

ఇందూ! ప్రతి కన్నెపిల్లా తన వివాహం గురించి, తన సంసారం గురించి ఎన్నో తియ్యని కలలు కంటుంది. అలాగే నేనూ ఎన్నో కలలు కన్నాను. తీరా ఆ కలలు ఫలించే సమయంలో నేను పడుతున్న ఈ వ్యధ భరించలేనిది. ఈ బాధ నుంచి నన్ను తప్పించు. ఒక్కసారి ఇక్కడకు రా! మనసారా నన్ను దీవించి వెళ్ళు. అంతేకాదు, నీ విక్కడికి వస్తే నీ కాళ్లమీద పడి అమ్మ చేసిన తప్పుని క్షమించమని నిన్ను అడగాలని ఉంది. లేకుంటే నాకు మనశ్శాంతి లభించదు.

ఇందూ! అదుగో అక్కడ కాబోయే నా భర్త ముఖంలో వెలుగొందే సంతృప్తిని చూస్తే నాకు భయం వేస్తున్నది అతడు బహుశా ఇలా అనుకుంటూ ఉండి ఉంటాడు. కాబోయే తన భార్య అందగత్తె! చదువుకుంది. తనని అన్నివిధాలా సుఖపెడుతుందని తలపోస్తూ ఉండి ఉంటాడు. అతని తలపులకి ఆధారభూతమైన నేను ఇప్పటి పరిస్థితుల్లో ఉన్న విధంగానే పెళ్ళయిన తరవాతకూడా ఉంటే ఆయన్ని సుఖపెట్టలేను సరికదా నా జీవితాన్ని నేనే దుఃఖభాజనం చేసుకుంటాను. ఎందుకో తెలుసా? అది నీ ఉసురు ఫలితం. ఆ నీ ఉసురు శాపంలా, గంధకంలా క్షణక్షణం నన్ను దహించి వేస్తూంటుంది. కనక నా యందు దయఉంచి ఈ శాపం నా నుండి మళ్ళించు. నాకు మనశ్శాంతి ప్రసాదించు. ఇది నాకు లభించాలంటే మార్గం అది నీ ఒక్క చల్లని దీవెనే అని నాకు తెలుసు. అందుకనే పెళ్ళి చేసుకుని నీ చల్లని దీవెనలు లేకుండా కాపరం చెయ్యాలని నాకు లేదు. ఎందుకంటే నా భావనలో ముక్కోటిదేవతల దీవెనలు ఒక పెట్టు, నీ ఒక్క అమృతపూరితమైన దీవెన ఒక పెట్టు. కనక తప్పకుండా నీవు ఇక్కడికి వచ్చి నన్ను దీవించి వెళ్ళు. ముఖ్యమైనది మరొక్క మాట. నా స్నేహితురాలికి ద్రోహం చేశాననే అపవాదు నా మనసులో కలకాలం కలక వెయ్యకుండా ఉండేందుకు నన్ను ఆశ్వాసించి వెళ్లమని మరీ మరీ ప్రార్థిస్తున్నాను.

చివరి మాట. బహుశా నీవు ఇదంతా నా భ్రమ అని, ఏదో పిచ్చిగా ఊహించుకుంటున్నానని తలుస్తావేమో! కాని అది తప్పు సుమా! నా మనసు పడే బాధ నీకే విధంగా తెలియజెప్పాలో నా కర్థం కావడం లేదు. అందుకనే కొన్ని క్షణాలైనా నీతో మాట్లాడే అవకాశాన్ని నాకు ఇవ్వు. దీన్ని నువ్వు కాదంటే నా మీద నీ కేమాత్రం ప్రేమ లేదని, నా సుఖాన్ని నీవు వాంఛించేదానివి కావని, ఇదంతా నా దురదృష్టమని అనుకుంటాను. అయితే నా ఈ దురభిప్రాయాన్ని నీవు తప్పకుండా వమ్ముచెయ్యడానికి ఇక్కడికి సత్వరమే వస్తావని వెయ్యి కళ్లతో నీ కోసం ఎదురు చూస్తుంటాను.

ఇట్లు

నీ ఆశీస్సులను అభిలషించే నీ ప్రియమైన

—అరుణ."

అరుణ వ్రాసిన ఈ ఉత్తరాన్ని వాళ్ల పనిమనిషి తెచ్చి నా కిచ్చింది. ఆ ఉత్తరం చదువుకుని దాని సారాంశం గ్రహించేసరికి నా స్థితి ఏమిటో నాకే అవగతం కాలేదు. ఒక విచిత్రమైన స్థితిలో పడిపోయాను నేను. నాకు అనుకున్న పెళ్ళి గమ్మత్తుగా, ఎవ్వరూ ఊహించని విధంగా ఇప్పుడు అరుణకు జరిగిపోతున్నది. ఇది ఎందుకు జరిగింది,

. . . ఈ వెన్నెల మనసు విరిగి కరిగిపోయిన కన్నె పిల్లల కన్నీటి తెరల ప్రతిబింబంలా ఉంది అనిపించింది నాకు . . . ఈ వెన్నెలను చూస్తూ ఎన్నో తియ్యని కలలు కన్నాను నేను. అవి అన్నీ ఇప్పుడు కారు చీకటిలో కొరివి దయ్యాల్లా కనిపిస్తూ నన్ను భయపెడుతున్నాయి. .



• కుమారి శోభ •

రాజమండ్రి వాస్తవ్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ కె. వి. నాయుడు గారి కుమార్తె చిరంజీవి శోభ, కూచిపూడి నృత్యంలో శ్రీ వెంపటి చిన సత్యం వద్ద, మద్రాసులోని కూచిపూడి ఆర్ట్ అకాడమీలో సుశిక్షితురాలై నవంబరు 29 న మదరాసు త్యాగరాయనగర్‌లోని రామారావు కళామండపంలో శ్రీమతి రుక్మిణీదేవి అరండేల్ సమక్షంలో తొలి ప్రదర్శన ఇచ్చింది. కుమారి శోభ కళాశాలనుండి కళారంగంలోకి అడుగిడి తన కళాభిజ్ఞతను ప్రదర్శిస్తున్నది.

ఎలా జరిగింది అని నన్ను నేనే ప్రశ్నించుకుంటే జవాబుగా గతం నా కళ్లముందు కదలసాగింది.

ఆ రోజున నాన్నకి విజయనగరం నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చూస్తూనే నాన్నకి ఎక్కడలేని సంతోషం ముంచుకు వచ్చింది. ఆ ఉత్తరం అమ్మకి చదివి వినిపిస్తుంటే ఆమె కెక్కడలేని ఆనందం కలిగింది. అమ్మ అప్పుడే నా పెళ్లి అయిపోయినంత సంబర పడిపోయింది.

"ఎంత మంచి సంబంధమండీ! ఇంత మంచి సంబంధం మరిం కెవరికి వస్తుంది? అబ్బాయి బి. కామ్. పాసయి ఏదో బాంకులో మూడువందలయాభై రూపాయిలు సంపాయిస్తున్నాడా? పైగా, ఒక్కగానొక్క కొడుకు! బోలెడంత ఆస్తికి వారసుడట! ఆస్తిని మించిన గుణవంతుడట! ఇంత మంచి సంబంధం మనలాంటి కొద్దిపాటి సంసారులకి వస్తుందని అనుకోలేదండి! ఇదంతా మన ఇందిర అదృష్టం. ఇంత మంచి సంబంధాన్ని మాట్లాడి కుదిర్చినందుకు ఆ సుబ్బరావమ్మగారికి వెయ్యేత్తి దణ్ణం పెట్టాలండి మనం!" అంది ఒక్క గుక్కలో అమ్మ.

"అవునవ్! సుబ్బరావమ్మగారి సహాయమే లేకుంటే అమ్మాయి కింత మంచి సంబంధం వచ్చేదా? అంతా ఆవిడ చలవే! ఆమె ఋణ మెలా తీర్చుకుంటామో ఏమో!" అన్నారు నాన్న కృతజ్ఞతాపూర్వకంగా.

"అవునూ! ఇంతకీ పెళ్లివారు ఎప్పుడు వస్తారుట! ?" అడిగింది అమ్మ.

"రేపు శుక్రవారంనాడు."

శుక్రవారం! అప్రయత్నంగా కాలెండరు చూశాను. తారీఖు పదమూడు!

నా గుండె దడదడలాడింది. హృదయంలో ఏదో అపశకునం లాంటి భయం న న్నావరించింది. పదమూడవ తారీఖు నా కచ్చిపాటు రాదు. ఈ విషయం నాకు బాగా తెలుసు. ఆనాడే అనుకున్నాను ఈ పెళ్లి జరగదని. కాని అమ్మా నాన్నల ఆలోచనలు దీనికి పూర్తిగా విరుద్ధం. 'ఏం జరుగుతుందో! వేచి చూద్దాం' అనుకున్నాను మనస్సులో.

సుబ్బరావమ్మగారు వయస్సులో పెద్దది మాత్రమే కాదు. మంచితనానికీ, మానవత్వానికీకూడా పెద్దదే అని నాకు తెలుసు. అందుకే ఆమె అంటే నాకు తగని గౌరవము, భక్తీను. ఆమె ఉండేది మా ఇంటి పక్కఇంటిలోనే! ఆమెకు ఇద్దరు కొడుకులు. ఇద్దరూ పెద్దవాళ్లే. ఎవరి సంసారాలు వాళ్లు దిద్దుకొనేవాళ్లే! వాళ్లు ఉద్యోగాలరీత్యా ఒకళ్లు బెజవాడలోను, మరొకళ్లు గుడివాడలోను ఉంటున్నారు. వాళ్లతోపాటు తనూ వెళ్లకుండా బందరులోనే తన స్వంత ఇంట్లో ఉంటూ రోజులు వెళ్లదీస్తున్నది.

సుబ్బరావమ్మగారికి కూతుళ్లు లేరు. ఆమెకి ఆడపిల్లలంటే తగని ఆపేక్షా, ఆదరణా ఉంది. అందుకే నన్ను ఎప్పుడూ స్వంతకూతురిలా చూసుకునేది. ప్రేమతో, ఆప్యాయంతో న న్నాదరించేది. ఏ ఒక్క రోజైనా ఆమె ఇంటికి వెళ్లకుండా ఉంటే తనే వచ్చి నన్ను తీసుకుపోయేది. "నీవు రాకుంటే నా కేం తోచదు, ఇందిరా!" అంటూ వీలయినంతవరకూ తన దగ్గరే న న్నట్టే పెట్టుకునేది. 'ఏమిటో ఈ పిచ్చి!' అనుకునేదాన్ని అప్పుడప్పుడు ఆమెను గురించి.

కొంతమంది ఇతరుల కోసం ఎందుకు అంతగా తాపత్రయపడతారో నాకు తెలియదు. కొంతమంది డబ్బు కోసం కావచ్చు. మరి కొంతమంది ప్రేమకోసం కావచ్చు. ఇంకొందరు ఇంకొక దానికోసం కావచ్చు. ఈ తాపత్రయం అనేది ప్రతి జీవిలోనూ ఉంటుందనుకొంటాను. అటువంటి తాపత్రయమే నా కోసం సుబ్బరావమ్మగారు చూపించింది. దాని ఫలితమే ఈ పెళ్లిసంబంధం! నాకు మంచి సంబంధం తీసుకురావాలని ఆమె చిరకాల వాంఛ. ఈ చిరకాల వాంఛ ఈడేర్చుకోవడానికి ఆమె స్వయంగా విజయనగరం వాళ్ల సంబంధం గురించి వాకబు చేసి, ప్రయత్నించి, వాళ్లకి నచ్చచెప్పి, వాళ్లు నన్ను చూసుకోడానికి వచ్చేలా చేసింది.

ఈ విషయం సుబ్బరావమ్మగారికి చెప్పడానికి బయలుదేరిన నాన్నకి నిరాశ ఎదురైంది. సుబ్బరావమ్మగారు క్రిందటి రాత్రే తన పెద్దకోడలికి జబ్బుగా ఉందని బయలుదేరి బెజవాడ వెళ్లిపోయింది.

ఆమె తిరిగి ఎప్పుడు వచ్చేదీ తెలీదు. ఆమె లేకుండా పెళ్లిచూపు లెలా జరుగుతాయో ఏమో అనే అనుమానంతో నాన్నా అమ్మల మనస్సులు కలతబారాయి. నా స్థితీ అలానే ఉంది. పెళ్లిచూపులు నా కిదే ప్రథమం!

సుబ్బరావమ్మగా రుంటే తనకీ, పెళ్లివారికీ మధ్య పెద్దలా వ్యవహరించి ఈ సంబంధాన్ని ఏదోవిధంగా ఖాయపరచవచ్చు. కాని ఆమె లేదు. ఆమె లేని లోటు ఎవరు తీరుస్తారు? అవును. ఎవరు తీరుస్తారు?. . .

మహాప్రవాహంలో కొట్టుకుపోయే వాడికి తెప్పలా, చీకట్లో తడుముకులాడేవాడికి వెలుగురేఖలా నాన్న మనస్సులో క్షణకాలం శారదాంబగారు మెరుపులా మెరిసింది. పెళ్లిళ్లు జరిపించడంలో శారదాంబగారికి గల ప్రజ్ఞాపాటవం తనకు తెలిసినంతవరకూ మరెవ్వరికీ లేదు. ఆమెను తను ఒప్పించి తీసుకుని వస్తే పెళ్లిపెద్దలా వ్యవహరించి తన బరువు బాధ్యతల్ని కాస్త తగ్గిస్తుంది. ఈ విషయమే అమ్మకు చెప్పారు నాన్న. "అంతకంటె మనకు కావలసినవాళ్లు మాత్రం ఎవ్వరున్నా" రంటూ అమ్మ శారదాంబను తీసుకురమ్మని నాన్నకిచెప్పి పంపించింది. భుజాన కండువా వేసుకొని రెండు వీథుల అవతల ఉన్న శారదాంబగారి ఇంటికేసి బయలుదేరి వెళ్లారు నాన్న.

ఇప్పు డనుకుంటున్నాను, నాకు తెలిసిన తరవాత అమ్మా నాన్నా కలిసి తెలీకుండా చేసిన తప్పు ఇదేనేమో అని. లేకుంటే ఈనాడు నా కీ వ్యథ మిగిలేది కాదు.

పెళ్లివారు వస్తామన్న శుక్రవారం రానేవచ్చింది. ఆ రోజున ఇంట్లో అమ్మా నాన్నల హడావిడి ఇంతా అంతా కాదు. పెళ్లివారు మరో మూడు గంటలకి వస్తారనగా శారదాంబగారు తన కూతురు అరుణతో సహా వచ్చింది మా ఇంటికి.

అరుణని చూడగానే నాకు ప్రాణం లేచివచ్చింది. అదీ, నేనూ కలిసి స్కూలు ఫైనలు వరకూ చదువు వెలగబెట్టాము. అరుణ రాగానే అన్నాను: "అబ్బ! ఎన్నాళ్లకే బాబూ నీ దర్శనం! కాలేజీ చదువు బాగా వంటపట్టిం దనుకుంటాను, బొత్తిగా కనిపించడం మానేశావు."

"నా కాలేజీ చదువుకేం గాని ముందు నీ విషయం చెప్పు. ఏం పిల్లా! మరీ తొందర రెక్కులొచ్చాయా, అప్పుడే పెళ్లికి సిద్ధపడ్డావు!" అంది ఆరిందాలా. అరుణ వత్తి కోతిరకం! అది మాట్లాడే మాటలన్నీ ఇల్లానే ఉంటాయి. కాని ఎంతో మంచి పిల్ల! కాపోతే సిల్లీ!

"ఏం, చెప్పవేం?" ఈ సారి గదమాయించింది.

"అబ్బే, నా దేముంది? అంతా అమ్మా నాన్నల ఇష్టం" అన్నాను.

"కాయ్ రాజా కాయ్! అంతా అనవాయుకి డిటోవన్న మాట!"

"ఊఁ . . . అల్లానే అనుకో!"

"అందుకనే మన ఆడవాళ్లంతా వత్తి డర్టీ క్రీచర్స్ అంటాను. ఏమంటావ్?"

"అలాగే అనుకోవే బాబూ! నీతో ఏమన్నా పేచీయే!"

"రట్స్వోల్! అది వదిలెయ్. ఇంతకీ పెళ్లికొడుకు క్వాలిఫికేషన్స్ ఏమిటో?" అంటూ మొదలుపెట్టింది. చెప్పక తప్పింది కాదు.


"అయితే నువ్వు చాలా అదృష్టవంతురాలివే, ఇందూ!" అంటూ నన్ను ముద్దు పెట్టేసుకుంది. ఇంతలో శారదాంబగారు నన్ను అలంకరించడానికి మా గదిలోకి వచ్చింది.

"అమ్మా! ఇందిరను బ్రహ్మాండంగా అలంకరించవే. దీని అందం, నీ అలంకరణ చూసి పెళ్లికొడుకు దంగయిపోవాలి. ఇందుని తప్ప ఇంక ఎవర్నీ పెళ్లి చేసుకోనుస్మీ అని అనిపించాలి" అంది అరుణ.

"అలాగేలే! ముందు నువ్వు కాస్త నోరు ముయ్యి" అంది శారదాంబగారు.

అయిందా నీ పని అన్నట్లు చూశాను అరుణని. కోపంతో రుసరుసలాడుకుంటూ వంటింటివేపు వెళ్లిపోయింది అరుణ. బహుశా మా అమ్మని మంచి చేసుకుని కాఫీ, టిఫిన్లు మెక్కెయ్యడానికనుకుంటా. దానికి అమ్మ దగ్గిర అల్లాంటి పరిచయమే ఉంది.

అనుకున్న టైమ్ ప్రకారం అయిదు గంటలకే వచ్చేశారు పెళ్లివారు. పెళ్లివారు వచ్చారంటూ నాన్న హాల్లోంచి



రావు తెగ కోస్తున్నాడు.

"నేను ... నేను చంపిన పెద్ద పులులకి లెక్కలేదు. ఆఫ్రికాలో ..." మూర్తి అడ్డు తగిలి, "ఆఫ్రికాలో పెద్దపులులు లేవయ్యా, బాబూ!" అన్నాడు.

"అవును. ఎలా ఉంటాయి? అన్నిటినీ నేనేగా చంపేశాను!" అన్నాడు రావు.

కేకవేశారు. శారదాంబగారు ఎట్లా అయితేనేం అలంకరణ పూర్తి అయిందని పించింది. అమ్మ గదిలోకి వచ్చి పెట్టెలో వించి నగలు తీసి నా మెడలో వేసింది. బజారునుంచి తెచ్చిన మల్లెలు దండగా గుచ్చి నా జడలో పెట్టింది అరుణ. రకరకాల పోజుల్లో నన్ను కెమెరా మెన్‌లా నించోపెట్టి రకరకాల ఏంగిల్స్ లోంచి చూసి ఓ. కె. అంది అరుణ.

"అవతల వర్జ్యం వచ్చేట్టుంది. మీ అలంకరణ అయిందా" అంటూ ఒక చిన్న కేక పెట్టారు నాన్న. ఆ కేక వినగానే ఎక్కడలేని భయం, సిగ్గూ ఆవరించాయి. ఇంతలో శారదాంబ గారు వచ్చి నన్ను తీసుకువెళ్లి మగపెళ్లి వారి కెదురుగా సిరిచాపమీద కూర్చో బెట్టింది. పక్కగదిలోంచి అరుణ చాటుగా ఉండి అంతా చూస్తూనే ఉంది.

కొంచెంసేపయిన తరవాత పెళ్లివారు అడిగినదానికి నేను సమాధానం చెప్పవలసిన అవసరం వచ్చింది. వాళ్లడిగిన దానికల్లా వెంటనే జవాబు చెప్పెయ్యా లనిపించింది. కాని ఎందుచేతనో చెప్పలేక పోతున్నాను. గుండెల్లో దడ, శరీరంలో అదో రకం వణుకు ప్రారంభమైనాయి. వాళ్లడిగినదానికి ఎట్లాయితేనేం సమాధానం చెప్పేననిపించాను. వాళ్లకి నేను నచ్చానట! 'అమ్మయ్య!' అనుకున్నాను.

ఎవరో అన్నారు పెళ్లికొడుకుని చూసి వచ్చాడో, లేదో చెప్పమని నన్ను. అతన్ని చూడాలనిపించింది. అంతవరకు సిగ్గుభారం చేత వాలిపోయి ఉన్న నా తలనీ, కళ్లనీ అటుకేసి ఓరగా తిప్పాను. అంతలోనే వల్లమాలిన సిగ్గు వచ్చింది. నా కళ్లు అతని కళ్లనీ, ఆ కళ్లలోని భావాలను చదవకుండానే సిగ్గుతో వాలిపోయాయి. కాసేపు నా కళ్లు అక్కడే తారట్లాడి చివరికి విశాలమైన అతని వక్షఃస్థలంపై నిలిచిపోయాయి. 'అది చాలు, కలకాలం నా తల దాచుకో డానికి!' అనుకున్నాను.

పెళ్లిచూపు లయిపోయాయి. ఇంక కట్నం కానుకల గురించి నాన్నా వాళ్లూ మాట్లాడుకోసాగారు.

"మా కన్నివిధాలా ఈ సంబంధం నచ్చింది. కట్నం ఏమాత్రం ఇవ్వగలరో చెబితే, అది మాకు నచ్చితే ఈవేళే తాంబూలాలు పుచ్చుకుందాం" అన్నాడు పెళ్లికొడుకు తండ్రి.

"మీ కింతకుపూర్వమే చెప్పాను. అన్ని లాంఛనాలు జరిపించి నాలుగు వేలు ఇవ్వగలం" అన్నారు నాన్న.


"అదేమిటండీ! మీరు మరీ అంత తీసికట్టుగా ఉంటారని తెలిస్తే మేము రాకనేపోదుము" అన్నాడు పెళ్లికొడుకు తండ్రి విస్మరంగా.

"నా సంగతి మీకు తెలియందేముంది? నేను చేసేది గుమాస్తా ఉద్యోగం. ఏదో నాలుగు రాళ్లు తెచ్చుకుని గౌరవంగా బ్రతుకుతున్నాము. ఇంకా పిల్లాజెల్లా కలవాణ్ణి. ఇంతకంటె ఎక్కువ ఇచ్చుకో లేము." ఆ విధంగా నాన్న తన అసహాయత వెల్లడించుకున్నారు.

"అలా అంటే ఎలా? అబ్బాయి బి. కామ్. పాసయి మంచి ఉద్యోగం చేస్తున్నాడుగదా! ఏదో వాడి స్నేహితుల్లో తలఎత్తుకు తిరగడానికి అయినా కాస్త అవకాశం ఇస్తారనే అంత దూరంనుంచి ఇంత దూరం వచ్చాము. ఇక్కడకు రాగానే మీరు వెనక్కిలాగటం ఏమంత బాగాలేదు." అసంతృప్తితో అన్నాడు పెళ్లికొడుకు తండ్రి. నాన్న మళ్లీ ఇందాకటి మాటే అన్నారు.

శారదాంబ గబగబా నాన్నని ఇవతలి గదిలోకి పిలిచి, "ఏమిటండీ, మీరు *మరీ బొత్తిగా కూరగాయలబేరంలా* మాట్లాడుతారు. బంగారంలాంటి సంబంధం ఇది. పైగా, కాళ్లదగ్గిరికి వచ్చింది. కాశీకి వెళ్లినా దొరకదు. మీరు మరో వెయ్యి ఇస్తాననండి. అమ్మాయి సుఖపడుతుంది. డబ్బుకి చూడకండి. అవసరం అయితే నేను సర్దుతాను" అంది.

నాన్న కాస్సేపు ఆలోచించి చివరకి సరే అన్నారు. వాళ్ల దగ్గిరికి వెళ్లి, "సరేనండి. మీరు కోరినట్టు అయిదు వేలిచ్చుకుంటాము. సంబంధం ఖాయం

చెయ్యండి!'' అన్నారు. ఆ మాటతో అందరి హృదయాలూ తేలికపడ్డాయి. తాంబూలాలు పుచ్చుకున్నారు. అరుణ ఉషారుగా నా బుగ్గ గిల్లి, ''యూ లక్కీ!'' అంది.

ఇందాకటినుంచి నా మనసులో రేగుతున్న అనుమానపు తుఫాను నన్ను ఊపేయసాగింది. పెరట్లో బాదంచెట్టు దగ్గిరికి అరుణను తీసుకువెళ్లి అరుణతో అన్నాను: ''అరుణా! నా కో సందేహం కలిగింది, తీరుస్తావా?''

''తీర్చగలిగితే తీరుస్తాను. అదేమిటో చెప్పు'' అంది అరుణ.

''అరుణా, ఆయనకి నేను తగినదాని నేనా?'' ఈ పక్కలో బాంబు పేలినంతగా ఉలిక్కిపడింది అరుణ.

''ఇప్పుడు నీ కా సందేహం ఎందుకు కలిగింది?'' అంది చివరకు విస్తుపోతూ.

''నేను చామనచాయగా ఉంటాను గదా! ఆయన నా కంటె ఎర్రగా అందంగా ఉంటారు. మా ఇద్దరికీ పెళ్లయిన తరవాత కాకిముక్కుకి దొండపండులా ఉంటామేమో నేను!'' నా కళ్లలో నాకు తెలీకుండానే నీళ్లు జేరుతున్నాయి.

''ఛా! పిచ్చిపిల్లా! నీవు చామన చాయగా ఉంటే ఏం? నీది వెన్నలాంటి మనసు. అనురాగపూరితమైన దాంపత్య జీవితానికి నిర్మలమైన మనస్సులు ప్రధానంగాని అందం ప్రధానం కాదుగా?''

ఫూల్! తను పుస్తకాల్లో చదివింది నాకు అప్పగిస్తూంది.

''ఈ రోజుల్లో అందాన్ని ప్రధానంగా. తీసుకుంటున్నప్పుడు ఆయన ముందు నేను తీసికట్టుగా ఉండనూ!?'' ఈసారి నా కళ్లలోంచి నీరు జలజలా రాలింది.

అరుణ నా కన్నీరు తుడుస్తూ, ''నిన్ను ఇష్టపడి అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న భర్త నీ మనసెరిగి ప్రేమతో నిన్ను చూస్తున్నప్పుడు పరాయివాళ్లు ఏమనుకుంటే నీ కెందుకు?'' అంది. అద్దాల్లాంటి ఆ ధర్మవాక్యాలను అరుణ వల్లిస్తుంటే నాకు చిరాకెత్తింది.

''అయితే ఆయనకి నేను నచ్చా నంటావా?'' అన్నాను చిరాగ్గా.

''ఆహా! అతనికి నీవు నచ్చావు కాబట్టే నిన్ను పెళ్లి చేసుకుంటానికి అతను తన అంగీకారం చూపించాడు. అతనికి నీవు నచ్చకపోతే ఏదో వంక బెట్టుకుని ఈపాటికి వెళ్లిపోయేవాడు. పిచ్చిఊహలతో మనసు పాడుచేసుకోకుండా నిశ్చింతగా ఉండు'' అంది అరుణ.

అరుణ చెప్పినదంతా నిజమే అనుకున్నాను. నా మనసులో రేగిన అనుమానపు తుఫాను క్రమంగా మాయమవసాగింది.

పెళ్లివారు భోజనాలు చేశారు. ఆ వచ్చినవారికీ, శారదాంబగారికీ ఏదో దూరపుబంధుత్వం ఉన్నదని మాటల్లో తెలుసుకుని శారదాంబగారు వారిని తన ఇంటికి ఆహ్వానించింది. ''ఈ రాత్రికి మా ఇంట్లో ఉండి రేపు వెళ్దురుగాని మా ఇంటికి రండి, అన్నయ్యగారూ!'' అంది పెళ్లికొడుకు తండ్రితో. ఆయన ఆ ఆహ్వానాన్ని సంతోషంగా అంగీకరించాడు. వెళ్లేముందు నాన్న దగ్గిర సెలవు తీసుకుంటూ, ''మేం ఇంటికి వెళ్లిన తరవాత లగ్నపత్రిక పంపిస్తాము, బావగారూ!'' అన్నాడు పెళ్లికొడుకు తండ్రి.

''చిత్తం'' అన్నారు నాన్న వారిని సాగనంపుతూ.

ఆ నాటి రాత్రి నాకు సరిగ్గా నిద్ర పట్టలేదు. తియ్యని ఊహలు నన్ను ముంచెత్తివేశాయి. ఆ చల్లని వెన్నెల రాత్రిలోకూడా చిరుచెమట బిందువులు నా ఒంటిమీద ముత్యాల్లా పొరాడసాగాయి. ఆ రాత్రి అంతా చందమామ తన వెన్నెల్లో ముంచెత్తాడు. నా మనసు నిండా అతను తన నవ్వులపువ్వులు వెదజల్లాడు. నే నెక్కడలేని సిగ్గుతో కలవలా ముకుళించుకుపోయాను.

రోజులు గడుస్తున్నాయి. విజయనగరంనుంచి లగ్నపత్రిక కోసం నాన్న ఎదురుచూడసాగారు. అయినా ఆ లగ్నపత్రిక అనుకున్న రోజుకి నాన్న చేతి కందనే లేదు. ఆయన హృదయంలో ఏదో అనుమానం చోటు చేసుకొని రోజురోజుకీ పెరగసాగింది. ఎందుకనో మూడు రోజులనుంచి నా కుడికన్ను అదరసాగింది. ఆడదానికి కుడికన్ను అదిరితే మంచిది కాదు అనేది నాయనమ్మ. పిచ్చినమ్మకం! వేడిచేసి కన్నదురుతుందేమో అనుకున్నాను.


ఓ రోజున సుబ్బరావమ్మగారు వచ్చి, ''ఇది విన్నారా?'' అంది. ఆదోలా ఉంది ఆమె.

''ఏమి టక్కయ్యా!'' అంది అమ్మ ఆందోళనగా.

''ఆ విజయనగరంవాళ్లు మన సంబంధం కాదని ఆ అరుణావాళ్ల సంబంధం కట్నం లేకుండా ఖాయపరుచుకుని లగ్నపత్రికకూడా పంపారట'' అంది.

అమ్మ గొల్లుమంది. నాన్న నెత్తిని పిడుగు పడిన ట్లనిపించింది. ఆయన పడకకుర్చీలో అల్లాగే జారగిలబడిపోయాడు. ఆయన కళ్లముందు ఏదో మబ్బుతెర నిలిచిన ట్లనిపించింది. ఆయన బాధగా ''ఊఁ'' అని మూలిగాడు.

తలుపు పక్కన నిలబడి అంతా విన్న నాకు కన్నులనిండా నీళ్లు నిలిచాయి.




డాక్టరు నిదానంగా రోగిని పరీక్షించాడు. ''ఇదంతా తాగుడు ప్రభావం... అంతకుమించి మరేమీ లేదు... దాని తప్పే'' అన్నాడు.

రోగి తృప్తిగా ఊపిరి పీల్చి ఇలా అన్నాడు:

''థాంక్యూ, డాక్టర్! మీరైనా సరిగా చెప్పారు ... నా తప్పేమీ లేదని మీరయినా తెలుసుకున్నారు. అంతే చాలు!''

ఆ కన్నీటి తెరల్లోంచి ఇంటి పరిసరాలన్నీ అస్పష్టంగా కనిపించసాగాయి. హఠాత్తుగా తగిలిన ఈ తీవ్రాఘాతానికి నా మనసు తల్లడిల్లిపోసాగింది. ఆ వార్తతో బలహీనమైపోయిన నా శరీరం గోడవారగా జారగిలబడిపోయింది. ఆ తరవాత ఏమి జరిగిందో నాకు తెలీదు. స్మృతి తప్పి పడిపోయాను.

తిరిగి కళ్లు తెరిచేసరికి డాక్టరుగారు పరీక్ష పూర్తిచేసి ఫిట్స్ అన్నాడు. ''దీనికి తోడు ఇదొక ఖర్మ, దేవుడా!'' అంది అమ్మ ఏడుస్తూ. సుబ్బరావమ్మగారు అమ్మని ఓదార్చసాగింది. నాన్న గోడవేపు తిరిగి కళ్లు తుడుచుకున్నారు.

* * *

ఉదయం పనిమనిషి తెచ్చి ఇచ్చిన ఉత్తరం మళ్లీ చదివాను. ఎంత చదివినా అరుణ భావం ఏమిటో అంతు పట్టడం లేదు. నేనేమిటి? అరుణ నేమిటి? క్షమించడమేమిటి? ఆమెను దీవించడమేమిటి? నా ఉసురు ఆమెకు శాపంలా తగలటమేమిటి? నేనేం చెయ్యాలి? నా కేమీ పాలుపోవడం లేదు. ఎలా అయితే నేమి చివరకు ఒక నిర్ణయానికి వచ్చాను. టైమ్ చూశాను. ఇంకో గంటలో పెళ్లి జరగబోతున్నది. గబగబా డ్రెస్ చేసుకుని, చెప్పులు వేసుకుని, ''అమ్మా, నేను అరుణా వాళ్లింటికి వెళుతున్నాను'' అని అమ్మ సమాధానంకోసం కూడా ఎదురు చూడకుండా వీథిలోకి వచ్చేశాను.

మేడమెట్లమీద నన్ను చూస్తూనే అంది శారదాంబగారు: ''రా, అమ్మా, ఇందూ! మీ అమ్మా నాన్నా పిలిచినా పెళ్లికి రాకపోయినా నీ వైనా వచ్చావు. అంతేచాలు. అరుణ మేడమీద ఉంది. వెళ్లు.'' మెట్లెక్కి అరుణ గది చేరుకున్నాను. అరుణ తన దుఃఖాన్ని ఎంతసేపటినుంచి బిగపట్టుకుని కూచుందో ఏమో! అది నన్ను చూస్తూనే నా ఒడిలో తల దూర్చి పసిపిల్లలా ఏడవసాగింది. నేను ఓదార్చసాగాను.

ఏడుపు దిగమింగుకుంటూ అంది అరుణ: ''ఇందూ! ఇలా జరుగుతుందని నేను కలలోకూడా అనుకోలేదు. నీ సౌభాగ్యాన్ని నేను నీ నుండి బలవంతంగా లాక్కుంటున్నాను. నన్ను క్షమించు.''

''క్షమించటానికి నీ వేం తప్పు చేశావని? వివాహాలు దైవనిర్ణయాలని పెద్దలంటారు. దైవమే మిమ్మల్ని ఆలూ మగలుగా నిర్ణయించింది. అందుకే నీ సౌభాగ్యం నిన్ను చేరింది. అందుకు ఆనందించాలిగాని విచారిస్తారా?'' అన్నాను.

''విచారించక నేను చేసేది మాత్ర మేముంది? మీ ఇంటి దగ్గిర అంతా ఖాయపరుచుకునివచ్చి, ఆ తరవాత ఇక్కడికి వచ్చి నన్ను తప్ప ఇంకెవర్నీ చేసుకోనంటున్నా డా పెళ్లికొడుకని మా అమ్మతోపాటు వాళ్లూ కుట్ర పన్ని నా మెడలు విరిచి ఈ పెళ్లికి నన్ను ఒప్పించారు. కాని సాటి ఆడదాని ఉసురు ఎంత బలమైందో నా కిప్పుడిప్పుడే తెలిసివస్తూంది. నిజం చెబుతున్నాను, ఇందూ! నీ ఉసురు ఎంత బలమైందో నాకు తెలీదుగాని, అది శాపంలా తగిలి నన్ను దహించి వేస్తున్నది. నీ చల్లని మంచి హృదయంతో, దివ్యమైన నీ వాక్కుతో నన్ను దీవించి, నాకు శాంతిని ప్రసాదించి వెళ్లు. లేకుంటే నేను శాంతితో బ్రతకలేను.''

(తరువాయి 47 వ పేజీలో)

# పెళ్ళిచూపులు

(31 వ పేజీ తరువాయి)

"ఛీ, పిచ్చిపిల్లా! నా ఉసురేమిటి? నీకు శాపమేమిటి? హాయిగా పెళ్ళి చేసుకుని సుఖంగా సంసారం చెయ్యక ఏమి టీ తిక్కవాగుడు? నీవు పెళ్ళి చేసుకుంటున్నావంటే నా కెంతో ఆనందంగా ఉంది. అంతేకాదు, నీ వంటున్నట్టుగా నా చల్లని దీవెనలన్నీ నీకే" అన్నాను.

"నీ దెంత మంచి హృదయమే, ఇందూ! నీ కింత అవమానం జరిగినా ఇల్లా మాట్లాడుతావని అనుకోలేదు" అంది అరుణ కొద్దిగా తేరుకుంటూ.

"అవమానమా! మాట ఇచ్చి తప్పిన వాళ్ళకేగాని అవమానం మాకు కాదు."

"కాని, ఇలా జరిగినందుకు నా కెంతో బాధగా ఉంది."

"మాకు లేని బాధ నీ కెందుకే, అరుణా! ఈ వెర్రి ఆలోచన లింక మానెయ్యి."

అరుణ కాసేపటిదాకా మాట్లాడలేదు. నా మాటలు పని చేస్తున్నా యనుకున్నాను. తరవాత అరుణ ఎటో చూస్తూ ఆలోచిస్తూ అంది: "ఇందూ! పెళ్ళికి ముందు మనలాంటి అమ్మాయిలు ఎన్నో తియ్యని కలలు కంటారంటారు. మరి నీవు?"

"లేదు. అలాంటి కలలు నేను కనలేదు. నా కా యోగ్యత లేదు." నాలో ఉద్రేకం ఉరకలువేయసాగింది. అంతలోనే సంబాళించుకుని మళ్ళీ అన్నాను: "అరుణా, జీవితంలో ప్రతి అడదీ సుఖపడాలనే కోరుకుంటుంది. దానికి అనుగుణంగానే కలలూ కంటుంది. ఆ కలలన్నీ నిజమైనప్పుడు సంతోషం వినా మరొకటి ఉండదు. కాని, నీ విషయంలో అలా జరగటం లేదు. ప్రకృతికి విరుద్ధమైన భావాలతో నీ మనసుని కోతివుండు బ్రహ్మరాక్షసిలా చేసుకుంటున్నావు. ఇది తప్పు. ఇకనైనా ఈ ఆలోచనలు మానివెయ్యి. లే. లేచి ఆనందంగా, తృప్తిగా నవ్వుతూ తిరుగు. లేకుంటే పెళ్ళికి వచ్చినవా ళ్లేమనుకుంటారు?"

"అది కాదు. నేను నీ సౌభాగ్యాన్ని..."

"ఇంక ఆ మాట అనకు. ఒకవేళ నేనే నీ సౌభాగ్యాన్ని అపహరించాలని ప్రయత్నించానేమో!"

చిత్రంగా చూసింది అరుణ. మళ్ళీ ఆ మాటే తిరిగి అన్నాను.

"అయితే మనఃస్ఫూర్తిగా నన్ను ఆశీర్వదిస్తావా?" అడిగింది అరుణ.

"ఓ. సంతోషంగా ఆశీర్వదిస్తాను. కావలిస్తే ఇప్పుడే అద్వాన్సుగా ఆశీర్వదిస్తాను. శీఘ్రమేవ సుపుత్ర ప్రాప్తిరస్తు" అంటూ నవ్వాను.


అంతవరకూ గంభీరంగా కూర్చున్నదల్లా అరుణ, "ఇందూ! నీ వెంత మంచిదానివే" అంటూ కౌగిలించుకుని ముద్దు పెట్టుకుంది. అరుణ కెక్కడలేని సంతోషం వచ్చింది. గాలికి ఎగిరిపోయిన మబ్బుతునకల్లా ఇందాకటివరకూ అనుభవిస్తున్న అరుణ బాధ ఇట్టే మాయమై పోయింది. గ్రహణం వీడిన చందమామలా ప్రకాశించసాగింది అరుణ ముఖం.

'నా వల్ల ఎవ్వరూ బాధపడకూడదు. నా బాధ నాకేగాని మరెవ్వరికీ కాకూడదు. నూత్నవధూవరులైన ఈ జంటను చల్లగా దీవించు, భగవాన్' అని భగవంతుని ప్రార్థించాను మనస్సులో.

కృష్ణపక్షమి. రాత్రి పదకొండు గంటలయింది. బయట అంతా నిశ్శబ్దం. ఇంట్లో అమ్మావాళ్ళు నిద్రపోతున్నారు. నాన్న ఇంకేదో సంబంధం కోసం సాయంకాలం బెజవాడ వెళ్ళారు. అతి త్వరలోనే విజయనగరంవాళ్ళ ముక్కుమీద గుద్దినట్టుగా నాకు మంచి సంబంధం చెయ్యాలని ఆయనకి అతి పట్టుదలగా ఉంది. తండ్రిగా ఆయన బాధ్యతను నేను కాదనను. ఆయన కూతురుగా నా బాధ్యతను తిరిగి నేను నెరవేర్చగలనా అనేది నా అనుమానం. అమ్మ నిద్దట్లో కూడా తిడుతూంది, "సిగ్గు లేని ముండా! ఆ పెళ్ళి జరిగేచోటి కెళ్ళడానికి నీ మొహం ఎలా చెల్లిందే?" అని.

నిజమే. నాకు సిగ్గు లేదు. లేకుంటే ఇంత జరిగినా నే నక్కడికి వెళ్ళడమేమిటి? కాని, వెళ్ళక తప్పదు. అరుణ మంచిది. దాని కే పాపమూ తెలీదు. అటువంటిదాని పెళ్ళి జరుగుతూంటే, దాని స్నేహితురాలినై ఉండి నేను వెళ్ళకుండా ఎలా ఉండగలను? అందుకే అమ్మ తిడుతున్నా అరుణపెళ్ళికి వెళ్ళాను. కాని, నాకు జరగవలసి ఉన్న ఆ పెళ్ళి నిర్దాక్షిణ్యంగా అరుణకి జరిగిపోయింది. అదే అమ్మావాళ్ల బాధ. అందుకే వాళ్ళకి కోపం; ఆ కోపం మూలంగానే నన్ను తిట్టడమూను.

ఆనాడు పెళ్ళిచూపులు జరిగి సంబంధం ఖాయం అయిన తరవాత నా మనస్సు నాకు తెలియకుండానే, నా అంగీకారం లేకుండానే ఆతని ఇల్లాలుగా ఎన్నెన్ని కలలను అది నా కళ్ళ కందించిందీ! ఎంతగా నా మనసు నన్ను వివశువును చేసిందీ? 'ఓ మనస్సా! నీ వెంత మంచి దుర్మార్గురాలివే! లేకుంటే పెళ్ళి కాకుండానే ఒక వ్యక్తికి భార్యగా కలలుగనే దురలవాటును నా కళ్ళకి నేర్పుతావా? ఈనాడు తిరిగి అటువంటి కలల్ని నా కళ్ళ కెందు కందించవూ? అత డింక నా భర్త కాడు గనక! మరి నా మనసులో బాగా రూపులు దిద్దుకున్న అతని రూపాన్ని (ఇప్పుడు ఒక పరాయిపురుషుడు) ఎందుకు నెట్టివెయ్యలేవూ? నీకు చేతకాదు గనక. ఎందుకు చేతకాదు? ఒక కన్నెమనసులో ముద్రింపబడిన ప్రథమపురుషుని రూపం అంత తేలిగ్గా చెరిగిపోదు గనక. అవును కదూ?



ప్రతిబింబం ఫోటో—శ్రీమతి పద్మా రామాచార్ (మద్రాసు-4)

చంద్రుడు ఉదయించా డనుకుంటా. తెల్లని వెన్నెల కిరణం నా మొహంమీద పడింది. ఇంక పెరట్లో బాదంచెట్టు కింద కూర్చో బుద్ధి కాలేదు. గబగబా వచ్చి మంచంమీద పడుకుని బయటకు చూడసాగాను.

క్రమంగా వెన్నెల చిక్కబడసాగింది తెల్లని పాలలా. ఈ వెన్నెలను చూస్తుంటే అదోరకం కవిత్వం పుట్టుకువస్తుంది నాలో. ఈ వెన్నెల మనసు విరిగి కరిగిపోయిన కన్నెపిల్లల కన్నీటితెరం ప్రతిబింబంలా ఉంది అనిపించింది నాకు. ఎందుకంటే ఈ వెన్నెలను చూస్తూ ఎన్నో తియ్యని కలలు కన్నాను నేను. అవి అన్నీ ఇప్పుడు కారుచీకటిలో కొరివి దయ్యాల్లా కనిపిస్తూ నన్ను భయపెడుతున్నాయి. ఇప్పు డనుకుంటున్నాను, 'పెళ్ళిచూపులయి, సంబంధం ఖాయమయి కూడా పెళ్ళికాబోయే కన్నెపిల్లలు కలలు కనడంకూడా తప్పే' అని. అలా అనుకుంటుంటే నాకు తెలీకుండానే నా కళ్లనుండి చెక్కిళ్లమీదికి కన్నీరు జాలువారసాగింది. ★